రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌గా కె.శ్రీనివాస్

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ గా కె.శ్రీనివాస్ రెడ్డి ని మరో రెండేళ్లు కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ గా రెండోసారి నియమితులైన కె.శ్రీనివాస్ రెడ్డికి టియూడబ్ల్యూజే – ఐజేయు నిజామాబాద్ జిల్లా తరపున రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బొబ్బిలి నర్సయ్య, మజీద్, ప్రమోద్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు గంగదాస్, జిల్లా అధ్యక్షులు ఏడ్ల సంజీవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.అరవింద్ బాలాజీ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు రాజేష్, కార్యదర్శి ధనుంజయ్ లు శుభాకాంక్షలు తెలియజేశారు.

దోషులను పట్టుకుని ఉరి తీయాలి

నగర రజక సంఘాల సమితి అధ్యక్షులు బగ్గలి అజయ్

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :రజక కుటుంబంపై జరిగిన దాడిలో దోషులను పట్టుకొని ఉరి తీయాలని నగర రజక సంఘాల సమితి అధ్యక్షులు బగ్గలి అజయ్ ప్రభుత్వాన్ని కోరారు. అలాగే బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే కోటి రూపాయలు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రజకజన సేవా సంఘం దోబీ గల్లి పెద్దతర్న నుండి శివాజీ నగర్ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాగర్ కర్నూలు జిల్లాలోని కుమ్మెర గ్రామం లో మల్లన్న జాతరలో రజక కుటుంబంపై జరిగిన దాడిలో రెండు నెలల పసిపాప మృతి చెందిందని, దానికి కారణమైనటు వంటి శ్రీనివాస్ రెడ్డి, మధు రెడ్డి, మిగతా ఆరుగురుని పట్టుకుని ఉరిశిక్ష వేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నగర రజక సంఘాల సమితి ఉపాధ్యక్షులు మల్లెపూల గోపీ, బగ్గలి కృష్ణ, రజకజన సేవా సంఘం పెద్దతర్న అధ్యక్షులు నడిపి సాయిలు, ప్రధాన కార్యదర్శి బగ్గలి సంజీవ్, కోశాధికారి బి. సంతోష్ సుదర్శన్, సాయి పవన్‌జం, శ్రీకాంత్, రఘు మల్లేష్, శేషి, శారదా, మల్లెపూల సంధ్య, బగ్గలి స్వప్న, అధిక సంఖ్యలో రజకులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న పోచారం దంపతులు

బాన్సువాడ, బతుకమ్మ :బీర్కూరు మండలం తిమ్మాపూర్ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానం లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడవ రోజు కార్యక్రమంలో దేవనాథ రామానుజ జీయర్ స్వామి వారి ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమములో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస రెడ్డి – పుష్ప దంపతులు పాల్గొన్నారు. పోచారంతో కలిసి ఆయన కుటుంబ సభ్యులు కూడా ఈ యజ్ఞంలో పాల్గొన్నారు. దేవనాథ రామానుజ జీయర్ స్వామి వారిచే భక్తులకు తీర్థ గోష్ఠి, నారాయణ ఇష్టి, ధ్వజకుంభారాధన బలిహరణం, పూర్ణాహుతి కార్యక్రమాలు చేశారు. అనంతరం అంగరంగ వైభవంగా మాడవీధుల్లో ఉదయం సూర్యప్రభ వాహనంపై, సాయంత్రం చంద్ర ప్రభ వాహనంపై స్వామి వారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

జన ఔషధి పథకం ఆరోగ్య రంగంలో ఒక విప్లవం

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ

శ్రీనగర్ కాలనీ, వినాయక్ నగర్ లలో ప్రధాన్ మంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం ప్రారంభం

నిజామాబాద్ సిటి, బతుకమ్మ : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జన ఔషధి పథకం ఆరోగ్య రంగంలో ఒక విప్లవాత్మక నిర్ణయమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నిజామాబాద్ నగరంలోని శ్రీనగర్ కాలనీ, వినాయక్ నగర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్రధాన్ మంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన ఔషధ కేంద్రంలోని మందుల నిల్వలు, సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ప్రజలు ఎక్కువ ఖర్చుతో మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉండగా, ఇప్పుడు అదే నాణ్యత కలిగిన ఔషధాలు 50% నుండి 90% వరకు తక్కువ ధరలకు అందుబాటులోకి రావడం గొప్ప విషయమని తెలిపారు. ఈ కేంద్రంలో 2000 కు పైగా నాణ్యమైన జనరిక్ ఔషధాలు, 300 కు పైగా సర్జికల్ పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు, వృద్ధులకు, పేద కుటుంబాలకు ఈ కేంద్రం ఎంతో ఉపయుక్తమవుతుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా వేలాది జన ఔషధి కేంద్రాలు ప్రారంభమవుతున్నాయని, ఆరోగ్య సేవలను ప్రతి కుటుంబానికి చేరవేయడం లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని తక్కువ ధరలో నాణ్యమైన మందులు పొందాలని ఆయన పిలుపునిచ్చారు. భవిష్యత్తులో నియోజకవర్గంలో మరిన్ని జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జన ఔషధి కేంద్ర యజమానులు రాథోడ్ ఆశ, రాథోడ్ అక్షయ్ లకు ఎమ్మెల్యే హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన ఔషధాలు అందించే ఈ సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 22వ డివిజన్ కార్పొరేటర్ వైష్ణవి, సుధ, 45వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బిలి సువర్ణ, వేణు, 19 డివిజన్ కార్పొరేటర్ నాగోల్లా లక్ష్మి నారాయణ, బీజేపీ నాయకులు, ప్రభాకర్, పవన్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని క్యాంపస్‌లను

వెంటనే మూసివేయాలి

అర్హత లేని సిబ్బందితో నిర్వహించిన పరీక్ష విధులపై చర్యలు తీసుకోవాలి

విద్యార్థులకు సరైన ధృవపత్రాలు జారీ చేయాలి

ఆర్ వై ఎఫ్ జిల్లా సెక్రటరీ పిట్ల నరేష్



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : జిల్లాలోని ఇంటర్మీడియట్ బ్రాంచ్‌లపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి అనుమతి లేని క్యాంపస్‌లను వెంటనే మూసివేయాలని ఆర్ వై ఎఫ్ జిల్లా సెక్రటరీ పిట్ల నరేష్ అన్నారు. జిల్లాలోని పలు ప్రైవేట్ ఇంటర్మీడియట్ కాలేజీల్లో జరుగుతున్న తీవ్రమైన అక్రమాలపై రెవల్యూషనరీ యూత్ ఫ్రంట్ జిల్లా కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రారంభమైన ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా ఆర్యనగర్‌లో ఉన్న ఎస్ ఆర్ జూనియర్ కాలేజ్, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ తెలంగాణ పరిధిలో పరీక్షా కేంద్రంగా పనిచేస్తోందని, కానీ ఇక్కడ పరీక్షల ఇన్విజిలేషన్ డ్యూటీలను గత మూడు సంవత్సరాలుగా అర్హతలేని వ్యక్తులతో నిర్వహిస్తున్నారన్నారు. కనీసం పీజీ అర్హత లేకుండా, కొందరు డిగ్రీ కూడా లేకుండా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. దీనికి ప్రధాన కారణం సరిపడా లెక్చరర్లను నియమించకపోవడమే అని తెలిపారు. దాస్‌నగర్‌లో ఉన్న ఏవీఆర్ గర్ల్స్ క్యాంపస్ కు ఎలాంటి అధికారిక అనుమతి లేకపోయినా, అక్కడ ఎగ్జామినేషన్ స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారని, ఈ కారణంగా ప్రధాన బ్రాంచ్‌లో లెక్చరర్ కొరత ఏర్పడిందని విచారం వ్యక్తం చేశారు. అంతేకాకుండా సరైన విద్యార్హత లేని వ్యక్తులకు పక్కన సబ్జెక్టులు అటాచ్ చేసి వారి పేర్లను సబ్జెక్టు లెక్చరర్స్ అని బోర్డ్ కు పంపిస్తున్నారని, పరీక్షా డ్యూటీ రెమ్యునరేషన్ డబ్బులు వారి ఖాతాల్లో జమ అవుతున్నాయని అన్నారు. బుధవారం జరిగిన ఎన్విరాన్ మెంటల్ ఎతిక్స్ పరీక్షలో పేపర్లు వార్డెన్స్ చేత కరెక్షన్ చేయించగా, వారికి కనీస పీజీ అర్హత కూడా లేదని, వారు పేపర్లపై తమ పేర్లు రాసి సంతకాలు చేశారని పేర్కొన్నారు. ఈ ఎగ్జామ్స్ కి సంబంధించిన ప్రాజెక్ట్ రికార్డ్స్ కాలేజ్ స్టోర్ రూమ్ లో దిద్దకుండానే పెట్టారని, కానీ మార్క్ షీట్ లో మాత్రం మార్క్స్ వేశారని, దాన్ని సిస్టంలో అప్లోడ్ చేశారని తెలిపారు. ఈ పరిస్థితి కేవలం ఆర్యనగర్ బ్రాంచ్‌కే పరిమితం కాకుండా ఎస్ ఆర్ కాలేజ్ మెయిన్ బ్రాంచ్ (గంగస్థాన్ బ్రాంచ్), ఎస్ఆర్ కాలేజ్ ఎంఎస్ఆర్ క్యాంపస్, ఎస్ఆర్ విశ్వ భారతి క్యాంపస్ లలో కూడా కొనసాగుతుందని అన్నారు. ప్రాక్టికల్ పరీక్షల్లో ఒక బ్రాంచ్ కోడ్ నుంచి ఫార్వర్డ్ చేసిన లెక్చరర్ స్థానంలో వేరే బ్రాంచ్ కోడ్ నుంచి లెక్చరర్లను డ్యూటీ చేయించారని, ఇది నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. అదేవిధంగా ఎస్ ఆర్ కాలేజ్, ఎవీఆర్ గర్ల్స్ క్యాంపస్ అనుమతి లేకుండా నడుస్తోందని, అక్కడ ఫీజు రసీదులు ఎస్ఆర్ కాలేజ్ ఏవీఆర్ క్యాంపస్ పేరుతో ఇస్తున్నారని, గత మూడు సంవత్సరాలుగా ఈ బ్రాంచ్ నడుస్తూ, ఒక్కో విద్యార్థి నుంచి ?1,20,000 నుంచి ?1,30,000 వరకు ఫీజులు వసూలు చేశారని పేర్కొన్నారు. అక్కడ వసూలు చేస్తున్న మొత్తం నల్లధనంగా మారుతుందని, ఈ మొత్తం అశోక్ రెడ్డి ద్వారా వరంగల్ చేరుతుందని, ప్రభుత్వం వెంటనే ఈ మొత్తాన్ని రికవర్ చేయాలని తెలిపారు. గతంలో సెకండియర్ పూర్తి చేసిన విద్యార్థుల టీసీలు, బోనాఫైడ్లు, ఇంటర్మీడియట్ మెమోలు అర్హత లేని ప్రిన్సిపల్స్ సంతకాలతో జారీ చేయబడ్డాయని, ఎస్ ఆర్, ఏవీఆర్ గర్ల్స్ క్యాంపస్ బ్రాంచ్ కే పర్మిషన్ లేనప్పుడు అక్కడ పనిచేస్తున్న ప్రిన్సిపల్ కి ఏ విధంగా అర్హత ఉంటుందని, విద్యార్థులు ఒక క్యాంపస్‌లో చదివి, వేరే బ్రాంచ్ ద్వారా ఫార్వర్డ్ చేయబడ్డారని అన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఉద్యోగాల కోసం సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో ఈ వ్యత్యాసం బయటపడితే విద్యార్థుల సర్టిఫికెట్లు చెల్లకపోయే ప్రమాదం ఉందని, వెంటనే అర్హత కలిగిన ప్రిన్సిపల్ సంతకంతో సరైన ధృవపత్రాలు జారీ చేయించాలని ఆయన కోరారు. అదేవిధంగా వరంగల్‌లో అనుమతి పొందిన ఎస్ ఆర్ యునివర్సిటీ పై కూడా సమగ్ర విచారణ జరిపి అక్రమాలు ఉన్నట్లయితే పర్మిషన్ రద్దు చేయాలని, ఒక చిన్న ఇంటర్మీడియట్ కాలేజీలోనే ఇన్ని అవకతవకలు జరుగుతున్నప్పుడు, విశ్వవిద్యాలయం స్థాయిలో పరిస్థితి ఎలా ఉంటుందనే సందేహం తలెత్తుతోందని అన్నారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే ఆర్ వై ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.